తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం

భగీరథ ట్యాంకులను పట్టించుకోని ప్రభుత్వం

- ఎమ్మెల్యే సబితారెడ్డి
- చెరువు బ్యూటిఫికేషన్ పనుల పరిశీలన
- పనులు వేగవంతం చేయాలని సూచన



కుర్మల్‌గూడ చెరువుకట్ట పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: మిషన్ భగీరథ ట్యాంకులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో ట్యాంకులను నిర్మించి, ఇంటింటికీ తాగునీరు అందించామని.. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆరోపించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కృషి చేయాలని సూచించారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడ అంతిరెడ్డి చెరువు సుందరీకరణ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. చెరువుల సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఈ చెరువుకు రూ.కోటి మంజూరు అయ్యాయని గుర్తుచేశారు. ఆ నిధులతో చెరువు బ్యూటిఫికేషన్ పనులు మొదలు పెట్టామని తెలిపారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు నాణ్యతగా చేపట్టి, సకాలంలో పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రోహిణి, భాస్కర్‌రెడ్డి, జంగయ్య, భాస్కర్, కీసరి భాస్కర్‌రెడ్డి, కరీం, వెంకట్‌రెడ్డి, జనన్మోహన్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కృష్ణారెడ్డి, నరేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

ఎంపీడీఓ సరిత



అంజయ్య దంపతులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

కందుకూరు: ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని ఎంపీడీఓ సరిత అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సబార్డినేట్ యాలాల అంజయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాల్‌లో ఎంపీడీఓతో పాటు తోటి ఉద్యోగులు అంజయ్య దంపతులను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఆయన శేషజీవితాన్ని సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, సూపరింటెండెంట్ సులోచన, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, సీపీఎం నాయకుడు చందు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినదిస్తున్న సీఐటీయూ నాయకులు తదితరులు

కందుకూరు: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెపాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ అన్నారు. సోమవారం మండల పరిధి రాచులూరులో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, 12 గంటలు పని చేయిస్తున్నారని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్ల పేరుతో కార్మికులకు యూనియన్ పెట్టుకునే అవకాశం లేకుండా, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణకు జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శైలజ, శమంత, సుగుణ, రాణి, నిర్మల, అలివేలు, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్ జ్ఞానేశ్వర్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం సోమవారం జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్ఞానేశ్వర్ దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపిక ప్రదానం చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులు, సిబ్బంది జ్ఞానేశ్వర్‌ను సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇబ్బంది పెడితే కేసులు పెడతాం

హిజ్రాలను హెచ్చరించిన సీఐ గురువారెడ్డి



హిజ్రాలతో మాట్లాడుతున్న సీఐ

పహాడీషరీఫ్: మామూళ్ల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదని ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి హెచ్చరించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో హిజ్రాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబ్బులు కావాలంటూ దుకాణదారులు, బాటసారులు, వాహనదారులను ఇబ్బంది పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. డబ్బులు ఇవ్వని వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఇకపై రోడ్లపై న్యూసెన్స్ చేస్తూ, ఎవరిని ఇబ్బంది పెట్టినట్లు సమాచారం వస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇకమీదట హిజ్రాలందరిపై నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కందుకూరు: మండల పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి విచ్చేయనున్నారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశపు హాల్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి లబ్ధిదారులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని తహసీల్దార్ గోపాల్ కోరారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఎమ్మార్పీఎస్ బాలాపూర్ ఇన్‌చార్జి రవిమాదిగ



నూతన సభ్యులకు నియామకపత్రం అందిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ బాలాపూర్ మండల ఇన్‌చార్జి బొర్ర రవిమాదిగ సూచించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా జల్‌పల్లిలో సోమవారం రాత్రి మాదిగల చైతన్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమ చరిత్ర, కమిటీ ఆవశ్యకత, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు, మాదిగల కర్తవ్యాన్ని వివరిస్తూ జూలై 7వ తేదీన గ్రామంలో జెండా గద్దె నిర్మాణం చేసుకొని ఘనంగా వేడుకలు జరుపుకోవాలని ఆయన సూచించారు. అన్ని కులాల ప్రజలను ఆహ్వానించి పండుగ వాతావరణంలో చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జల్‌పల్లి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యంజాల దేవేందర్, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రోహిత్, కార్యదర్శిగా గద్దల సంజయ్, కోశాధికారిగా దోర్నాల గణేష్, కార్యవర్గ సభ్యులుగా సన్ని, వంశీ, రవి, వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి యంజాల శివకుమార్, సలహాదారులు గద్దల రవీందర్, మహేందర్, దానయ్య, యంజాల జనార్దన్, రాంచరణ్, నర్సింహా, రామారావు తదితరులు పాల్గొన్నారు.
నన్మోహన్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కృష్ణారెడ్డి, నరేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్

హస్తినాపురం: మద్యంమత్తులో కత్తితో పొడిచి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు రిమాండ్ తరలించారు. ఇన్‌స్పెక్టర్ తోట మహేశ్ వివరాల ప్రకారం.. హయత్‌నగర్ సాయినగర్‌కాలనీకి చెందిన పోలవరపు తాండవకృష్ణ గత నెల 26న రాత్రి తన స్నేహితులు ఎస్.సాయిమల్లికార్జున్‌రాజు, మాచర్ల సంతోష్, మాచర్ల సతీష్, ఎ.తరుణ్‌తో కలిసి సామనగర్‌లోని జీవీఆర్ కన్వెన్షన్ హాల్ ముందు నిలబడి మాట్లాడుకుంటున్నారు. అప్పుడే అక్కడున్న బార్‌లో నుంచి బయటికి వచ్చిన ఓ వ్యక్తి వీరితో గొడవ పడ్డాడు. కారు డిక్కీలొంచి కత్తి తీసుకువస్తుండగా అక్కడున్న వారు పారిపోవడానికి ప్రయత్నించగా తాండవకృష్ణను పట్టుకుని కడుపులో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌కు చెందిన నందగిరి రాజుగౌడ్‌గా గుర్తించి రిమాండ్‌కు తరలించారు.

కరెంట్ కష్టాల నుంచి కాపాడండి

ఆమనగల్లు: కరెంటు కష్టాల నుంచి ప్రజలను కాపాడాలని బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అయిందని, ప్రస్తుతం తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. కరెంటు ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, గృహ అవసరాలకు 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏడీఈకి వినతిపత్రం అందజేశారు.